క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



ఎంపికైన జట్టుతో ప్రిన్సిపల్, పీడీలు

చిల్లకూరు: స్థానిక బాలుర గురుకుల పాఠశాల క్రీడామైదానంలో ఆదివారం ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొనే జిల్లా జట్టును ఎంపిక చేశారు. ఉమ్మిడి నెల్లూరు జిల్లాకు చెందిన హ్యాండ్ బాల్ పోటీల్లో పాల్గొనే జిల్లా జట్టును ఎంపిక చేసి కడపలో జరిగే రాష్ట్ర పోటీలకు పంపుతున్నట్లు గురకుల పీడీ తెలిపారు. ఉమ్మిడి నెల్లూరు జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి, గురుకుల పీడీ శ్రీరేష్ మాట్లాడుతూ వైఎస్సార్ కడపలో ఈనెల 14 నుంచి 16 జరిగే రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ హ్యాండ్‌బాల్ పోటీలలో పాల్గొనేందుకు జిల్లా జట్టును ఎంపిక చేశామని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను, గురుకుల ప్రిన్సిపల్ మీరా సాహెబ్ అభినందించారు. పీఈటీలు సహకరించినట్లు శ్రీరేష్ తెలిపారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు..



డీవీసత్రం: ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

దొరవారిసత్రం: స్థానిక బీసీ గురుకుల పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయిలో ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయిలో అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు స్థానిక ప్రిన్సిపల్ తిరుపతయ్య ఆదివారం తెలిపారు. నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో నిర్వహించిన అథ్లెటిక్స్ పోటీల్లో డీవీసత్రం బీసీ గురుకుల పాఠశాలకు చెందిన పి.యశ్వంత్ రెడ్డి 200 మీటర్లు, టి. ప్రశాంత్ 1,500 మీటర్ల పరుగు పందెంలో మొదటి స్థానం సాధించగా టి.రాజేష్ లాంగ్‌జంప్‌లో తృతీయ స్థానంలో నిలిచి జిల్లా స్థాయిలో ప్రతిభ చాటారు. దీంతో రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీలకు వీరు ఎంపికయ్యారు. ప్రతిభ చూపిన విద్యార్థులను ప్రిన్సిపల్‌తో పాటు పీఈటీలు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

కళలు దేశ సంస్కృతికి చిహ్నాలు



సర్టిఫికెట్లను అందజేస్తున్న దేవసేనమ్మ

గూడూరురూరల్: కళలు దేశ సంస్కృతికి చిహ్నాలని స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్‌పర్సన్ పొనకా దేవసేనమ్మ అన్నారు. పట్టణంలోని డీఎస్‌ఆర్ కమ్యూనిటీ హాలులో ఆదివారం నాట్య గురువు పిండి మల్లిక ఆధ్వర్యంలో శ్రీ శివ లలిత భరత నాట్య కళాక్షేత్రం సంస్థ ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. చిన్నారులు ప్రదర్శించిన భరత నాట్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమానికి హాజరైన పొనకా దేవసేనమ్మ ఆంధ్ర మహిళా మండలి గౌరవాధ్యక్షురాలు డాక్టర్ రోహిణితో కలిసి అలిగిరి నందిని నృత్యంతో సరికొత్త ప్రపంచ రికార్డు నమోదు చేసిన చిన్నారులకు సర్టిఫికెట్లను ప్రదానం చేసి అభినందించారు. యోగా మాస్టర్ మురళీకృష్ణ, రోటరీ మాజీ గవర్నర్ మునిగిరీష్, టి.వి.ఎల్. ప్రసాద్ పాల్గొన్నారు.

కండలేరులో 11.692 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం 11.692 టీఎంసీ నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్‌రెగ్యులేటర్ నుంచి 50 క్యూసెక్కులు, లోలెవల్ స్లూయిజ్‌కు 10 క్యూసెక్కుల వంతున విడుదలచేస్తున్నట్లు ఆయన వివరించారు.

కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

రాపూరు: రాపూరులోని జెమ్స్ స్కూల్‌లో ఆదివారం బెంగళూరుకు చెందిన విజన్ స్ప్రింగ్ స్వచ్ఛంద సేవ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరంలో 200 మందికి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి అద్దాలను అందజేశారు. కంటి వైద్యులు జలీల్, మొహ్మద్ సయీద్, జబీన, కరస్పాండెంట్ మునీంద్రారెడ్డి పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి నెల్లూరుకు చెందిన రేబల ముత్తు రజనీకాంత్‌రెడ్డి జ్ఞాపకార్థం ప్రసూనాంబ ఆదివారం రూ.లక్ష విరాళంగా అందజేశారు. ఈఓ సాగర్‌బాబు దాతలకు కృతజ్ఞలు తెలిపారు. స్వామి, అమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు. గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేదపండితులు వారిని ఆశీర్వదించి తీర్థప్రసాదాలను అందజేశారు.

సులువుగా.. సూటిగా

- సర్కారు బడుల్లో విద్యార్థులకు డిజిటల్ బోధన
- విద్యా రంగంలో రాష్ట్ర ప్రభుత్వం విప్లవాత్మక మార్పులు
- పేదలకు కార్పొరేట్ స్థాయి చదువు
- హర్షం వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు



దొరవారిసత్రం కేజీబీవీలో ఐఎఫ్‌పీ ద్వారా విద్యార్థులకు బోధన

దొరవారిసత్రం: కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా సర్కారు బడుల్లోని విద్యార్థులకు బంగారు బాటలు వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం విప్లవాత్మక మార్పులు తీసుకొస్తోంది. మన-బడి, నాడు-నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పనకు పెద్ద పీట వేసింది. దీంతో బడుల్లో విద్యా ప్రమణాలు పెరిగాయి. ఇప్పుడు నూతనంగా 3 నుంచి ఇంటర్ విద్యార్థుల వరకు సాంకేతిక విద్యను అందించేలా చర్యలు చేపట్టింది. ఈ క్రమంలోనే తొలి విడత నాడు-నేడు పనులు పూర్తి చేసుకున్న ప్రతి ప్రభుత్వ పాఠశాలకు సాంకేతిక విద్యకు అవసరమైన అన్ని వసతులు కల్పించి వస్తువులు, పరికరాలను ప్రభుత్వం సరఫరా చేసింది. ఇప్పటికే ప్రాథమిక పాఠశాలల్లోని 3,4,5 తరగతుల విద్యార్థుల కోసం స్మార్ట్ టీవీలు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్(ఐఎఫ్‌పీ) ఏర్పాటు చేసింది.

సాంకేతిక తరగతులు

దొరవారిసత్రం మండలం పరిధిలో ప్రాథమిక పాఠశాలలు 51, ప్రాథమికోన్నత పాఠశాలలు 5, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు 6 ఉన్నాయి. వీటితో పాటు కేజీబీవీ, బీసీ గురుకుల పాఠశాల, ఆదర్శ పాఠశాలలు కలవు. ఈ పాఠశాలల్లో 3,651 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. తొలి విడత మన బడి, నాడు-నేడు కింద పనులు పూర్తి చేసుకున్న బూదూరు, శ్రీధనమల్లి, తల్లంపాడు, తుంగమడుగు, ఉచ్చూరు గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలు, మినమనముడి, నెలబల్లి గ్రామాల్లోని ప్రాథమికోన్నత పాఠశాలలకు 10 స్మార్ట్ టీవీలు సరఫరా చేశారు. అదే విధంగా డీవీ సత్రంలోని కేజీబీవీ పాఠశాలలో ఐఎఫ్‌పీలు 5, బీసీ గురుకుల పాఠశాలకు 10, మావిళ్లపాడులోని ఆదర్శ పాఠశాలకు 10, ఏకొల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 3 ఐఎఫ్‌పీలను ఏర్పాటు చేశారు. ఈ పాఠశాలల్లో 6 నుంచి ఇంటర్ వరకు ఉన్న విద్యార్థులు సులువుగా సాంకేత విద్య బోధపడేలా ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్లానల్స్(ఐఎఫ్‌పీ) ద్వారా బోధన చేస్తున్నారు. సర్కారు బడుల్లో స్మార్ట్ టీవీ, ఐఎఫ్‌పీ వంటి ఏర్పాటు చేసినందున విద్యార్థులకు సులుభంగా అర్థం అయ్యే అవకాశం ఉందని ఉపాధ్యాయులు తెలిపారు. ప్రతీ విషయాన్ని వీక్షిస్తూ సులువుగా నేర్చుకునేందుకు ఎంతగానో దోహదపడుతున్నాయని ఇటు ఉపాధ్యాయులు, అటు విద్యార్థుల తల్లిదండ్రులు పేర్కొంటున్నారు.



డీవీ సత్రం కేజీబీవీ పాఠశాలలో..

సులభతరంగా బోధన

ఐఎఫ్‌పీ, స్మార్ట్ టీవీలు ఇంటర్నెట్‌తో పని చేస్తాయి. ఐఎఫ్‌పీలు మాత్రం ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో కూడా వినియోగించుకోవచ్చు. యూట్యూబ్‌ను కనెక్ట్ చేసి సులభంగా విద్యార్థులకు బోధిస్తున్నారు. చూస్తూ వినడం వల్ల ప్రతి అంశాన్ని విద్యార్థులు సులువుగా నేర్చుకుంటున్నారు. అంతర్జాతీయ స్థాయిలో వస్తున్న మార్పులకు అనుగుణంగా పోటీ పడే సత్తా పెంచుకుంటున్నారు.

చాలా బాగా అర్థం అవుతోంది



ఐఎఫ్‌పీ ద్వారా గతం కంటే ఇప్పుడు ప్రతీది బాగా అర్థం అవుతోంది. ఒకవేళ అర్థంకాకపోయినా మళ్లీ వీక్షించడం వల్ల సులువుగా అర్థం చేసుకోగలుగుతున్నాం. ఇలాంటి మార్పుల వల్ల అన్ని రంగాల్లో పోటీపడి గెలవగలమనే నమ్మకం పెరుగుతోంది.

-ఎం లాస్య, 10వ తరగతి, కేజీబీవీ, దొరవారిసత్రం

లైవ్‌లో వీక్షించినట్టే



బ్లాక్ బోర్డుపై కంటే ఐఎఫ్‌పీలో పాఠాలు బోధించడం వల్ల ప్రతి అంశం లైవ్‌లో వీక్షించినట్లు విద్యార్థులు క్షుణ్ణంగా అన్ని నేర్చుకుంటారు. దీంతో సులభంగా పాఠం అర్థం అవుతుంది. లైవ్‌లో బోధించినందున విద్యార్థులకు చెప్పిన ప్రతి అంశం గుర్తుండిపోతుంది.

-పార్వతి, స్పెషల్ ఆఫీసర్, కేజీబీవీ, డీవీ సత్రం

సులభంగా అర్థం చేసుకుంటున్నారు



స్మార్ట్ టీవీలు అందుబాటులోకి వచ్చినందున విద్యార్థులు పాఠాలు సులభంగా అర్థం చేసుకుంటున్నారు. స్మార్ట్ టీవీలో లైవ్ చూస్తూ విద్యార్థులు ఎంతో శ్రద్ధగా నేర్చుకుంటున్నారు. ఆడియో, వీడియో ద్వారా చిన్న అంశాన్ని సైతం గుర్తుపెట్టుకుంటున్నారు.

-రామ్‌బాబు, హెచ్‌ఎం, ఎంపీయూపీ, తల్లంపాడు

ఎంతో ఉపయోగం



ఐఎఫ్‌పీ, స్మార్ట్ టీవీల ద్వారా విద్యార్థులకు సాంకేతిక విద్యను అందుబాటులో తీసుకువచ్చినందున ప్రతి అంశాన్ని విద్యార్థులు బాగా తెలుసుకుంటారు. తొలి విడత నాడు-నేడు పనులు పూర్తి చేసుకున్న ప్రతి పాఠశాలకు సాంకేతక విద్యను అందించేలా ఇంటర్నెట్ అనుసంధానంతో ఐఎఫ్‌బీ, స్మార్ట్ టీవీలను పాఠశాలల్లో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

-మునిశేఖ్, కృష్ణయ్య, ఎంఈఓ-1, 2, డీవీ సత్రం

కానూరులో జగనన్న ఆరోగ్య సురక్ష రేపు

పెళ్లకూరు: మండలంలోని కానూరు గ్రామం ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఈనెల 10న మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆదివారం స్థానిక ఎంపీడీఓ సురేష్ బాబు తెలిపారు. సచివాలయ పరిధిలోని అన్ని ప్రాంతాల ప్రజలు సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు, ఇప్పటికే ఇంటింటా సర్వే చేపట్టి టోకన్లు అందజేసిన వ్యాధిగ్రస్తులు సురక్షలో అందిస్తున్న నాణ్యమైన వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేడు ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం

నాయుడుపేటటౌన్: పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం సమీపంలో ఉన్న వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ వద్ద సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం జరుగుతుందని మున్సిపల్ చైర్ పర్సన్ కటకం దీపిక ఆదివారం తెలిపారు. వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేయనున్నట్లు చెప్పారు. సోమవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం వరకు జరిగే వైద్య శిబిరాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పూరిళ్లు దగ్ధం



దగ్ధమైన పూరిళ్లు

సైదాపురం: మండలంలోని చెర్లోపల్లిలోని రామకృష్ణాపురం కాలనీకి చెందిన పంతగాని అంకయ్య పూరిళ్లు ప్రమాదవశాత్తు శనివారం రాత్రి విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా దగ్ధమైంది. ప్రమాదంలో రూ.లక్ష మేర నష్టం వాటిల్లినట్లు బాధితుడు పేర్కొన్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

రేపటి నుంచి ప్రసన్న వేంకటేశ్వరస్వామి పవిత్రోత్సవాలు

తిరుపతి కల్చరల్: అప్పలాయిగుంట ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం నుంచి ఈనెల 12వ తేదీ వరకు పవిత్రోత్సవాలు శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు. ఇందుకోసం సోమవారం సాయంత్రం అంకురార్పణ జరగనుంది. యాత్రికులు, సిబ్బంది కారణంగా తెలియక చేసిన దోషాలతో ఆలయ పవిత్రతకు లోపం రాకుండా నివారించేందుకు పవిత్రోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. పవిత్రోత్సవాల్లో భాగంగా మొదటి రోజైన మంగళవారం పవిత్ర ప్రతిష్ఠ, 11న పవిత్ర సమర్పణ, పవిత్ర హోమాలు చేపడతారు. చివరి రోజు 12న మహాపూర్ణాహుతి, పవిత్ర విసర్జన జరగనుంది. పవిత్రోత్సవాల సందర్భంగా ప్రతి రోజూ ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు.

నాడు దాహం తీర్చింది.. నేడు దుర్గంధంగా మారింది



నిరుపయోగంగా ఉన్న బావి



బావిలో జంతువుల వ్యర్థాలు

చిల్లకూరు: పదేళ్ల క్రితం వరకు తాగునీటి అవసరాలను తీర్చిన బావి నేడు నిరుపయోగంగా మారింది. కొందరు ఆ బావిలో జంతువుల వ్యర్థాలను వేస్తుండడంతో చుట్టు పక్కల నివసించే వారు దుర్గంధంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని ముత్యాలపాడు పంచాయతీ పరిధిలోని నాంచారమ్మపేట గ్రామంలోని ముస్లిం కాలనీ సమీపంలో సుమారు 40 ఏళ్ల క్రితం తాగు నీటి బావి ఉంది. అయితే 10 ఏళ్ల వరకు అందులో నీటిని అవసరాలకు వినియోగించుకునేవారు. కాలక్రమంలో బావిలో నీరు అడుగంటి పోయింది. దీంతో అది నిరుపయోగంగా మారడంతో కొందరు అందులో జంతువుల వ్యర్థాలను వేస్తున్నారు. దీంతో అవి మురిగి పోయి దుర్గంధం వెదజల్లుతుంది. పలుమార్లు పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేసినా పట్టిచుకోకపోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి నిరుపయోగంగా ఉన్న బావిని పూడ్చి వేయడం లేదా పైన జల్లెడ లాంటిది ఏర్పాటు చేసి దుర్గంధం రాకుండా అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు. దీనిపై ఈఓపీ ఆర్‌డీ మాణిక్యంను వివరణ కోరగా పంచాయతీ కార్యదర్శిని సోమవారం క్షేత్ర స్థాయిలో పరిశీలించి తాత్కాలికంగా పారిశుద్ధ్యం పనులు చేస్తామన్నారు. అనంతరం ఉన్నతాధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు.

పచ్చిరొట్ట సాగుపై రైతుల ఆసక్తి



ఆరూరు వద్ద సాగులో ఉన్న జీలుగ పైరు

చిట్టమూరు: మండలంలో ఖరీఫ్ సీజన్‌లో రైతులు తమ పొలాలను సారవంతం చేసుకునేందుకు ముందు చూపుగా పచ్చిరొట్ట పైర్ల సాగుకు ఆసక్తి చూపుతున్నారు. వ్యవసాయశాఖ అధికారుల సూచనల మేరకు మండలంలో ఎల్లి, వరినాట్లు వేసే పొలాల్లో రైతులు పచ్చిరొట్ట పైర్లయిన జనుము, మినుము, పిల్లి పెసర, జీలుగను సాగు చేస్తున్నారు. ఓ మోస్తరు వర్షాలు కురుస్తుండడంతో పొలాలను దుక్కి చేసి జీలుగ విత్తనాలు చల్లి పచ్చిరొట్ట పైర్లను పెంచుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం రాయితీపై రైతులకు పచ్చిరొట్ట విత్తనాలను వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాల ద్వారా అందజేసినట్లు వ్యవసాయాధికారి సుచేంద్ర ప్రసాద్ తెలిపారు. అలాగే రైతులకు రాయితీపై ధీర్ఘకాలిక వంగడమైన బీపీటీ 5204 వరి విత్తనాలను (పెద్ద జిలకర) అందజేయనున్నట్లు పేర్కొన్నారు. సూపర్ పాస్పెట్ కావాల్సిన రైతులు ముందుగా రైతు భరోసా కేంద్రాల్లో తమ పేర్లు నమోదు చేయించుకుని ఎంత కావాలో తెలియజేయాలని కోరారు. మండలంలో ఎల్లసిరి, ఈశ్వరవాక, మెట్టు, గునపాడు, గునపాటిపాళెం, తిమ్మారెడ్డి వాగు, ఆరూరు గ్రామాల్లో ఎక్కువగా రైతులు జీలుగను పెంచుతున్నారు. మరో నెల రోజుల్లో బోరునీటి వసతి ఉన్న గ్రామాల్లో రైతులు పొలాలను దుక్కి చేసి నాట్లు వేయనున్నారు. ఈ సంవత్సరం మండలంలో రైతులు జీలుగను పెంచేందుకు మొగ్గు చూపుతున్నారు. అయితే మండలంలో వర్షాధారం, బోరు నీరు, తెలుగుగంగ కాలువల ద్వారా వచ్చే సాగునీటితో వరి పంటలు పండుతాయి.

ప్రమాదకరంగా మారిన పాఠశాల





శిథిలావస్థకు చేరిన పాత పాఠశాల గదులు

సైదాపురం: స్థానిక పడమరవీధిలో ఉన్న ప్రాథమిక, అంగన్‌వాడీ పాఠశాలల మధ్యలోని పురాతనమైన పాఠశాల భవనం వల్ల ముప్పు ఏర్పడుతుందని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. పాఠశాల పక్కనే మరో అంగన్‌వాడీ, ప్రాథమిక పాఠశాల ఉండడంతో విద్యార్థులు పాత భవనం వైపు సంచరిస్తుంటారని ఏక్షణం ఏం జరుగుతుందోనని విద్యార్థుల తల్లిదండ్రులు అంటున్నారు. అధికారులు స్పందించి పాత పాఠశాల రేకుల షెడ్డును తొలగించాలని కోరుతున్నారు.

సంఘ కాపరులకు సత్కారం



పాస్టర్‌ను సత్కరిస్తున్న ఏరూరు సంఘ సభ్యులు

చిల్లకూరు: ప్రపంచ సంఘ కాపరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని పలు చర్చిల్లో ఆదివారం ఆయా సంఘాల కాపరులను క్రైస్తవులు ఘనంగా సత్కరించారు. సౌత్ ఆంధ్ర లూథరన్ చర్చిలో పాస్టర్లను సన్మానించారు. ఏరూరులోని జాన్ లూథరన్స్ చర్చిలో సంఘ కాపరి విజయకుమార్ దైవ సందేశం అందించారు. అనంతరం శాంతి కోరుతూ ప్రార్థనలు చేశారు.

వీనులవిందు చేసిన గాత్ర కచేరి



తమ గానంతో ప్రేక్షకులకు వీనులవిందు చేస్తున్న గాయకులు

తిరుచానూరు(చంద్రగిరి): వారాంతపు సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన గాత్ర కచేరి వీనులవిందు చేసింది. తిరుపతికి చెందిన దిలీప్ కుమార్ ఆధ్వర్యంలో గాయకులు శిరీష, సాయి స్పందన, సుదర్శన్ పలు ఆధ్యాత్మిక పాటలను వినసొంపుగా ఆలపించారు. వారికి కీబోర్డుపై దేవా సహకరించారు. కళాకారులను ఏఓ ఖాదర్‌వలి సత్కరించారు. జ్ఞాపకలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాధాకృష్ణ, పప్పి, వరప్రసాద్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యానానికి ఊపిరి



మొక్కలకు డ్రిప్ ద్వారా నీటి సరఫరా



బొప్పాయి తోటలను పరిశీలిస్తున్న ఉద్యానశాఖాధికారులు

- ప్రోత్సాహకాలు పెంచిన ప్రభుత్వం
- బడ్జెట్‌లోనూ ప్రత్యేక కేటాయింపులు
- చిన్న, సన్నకారు రైతులకు మరింత మేలు

సైదాపురం: రైతే రాజు అనే మాట నిజం చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారు. జిల్లాలో ఉద్యానశాఖను అభివృద్ధి పథంలోకి తీసుకుని వచ్చేందుకు ప్రభుత్వం అనేక రాయితీలను కూడా ప్రకటించింది. పండ్ల తోటల పెంపకంతో పాటు కూరగాయాల పెంపకం, పాత తోటల పునరుద్ధరణ చేసుకునేందుకు రాయితీ సదుపాయం కూడా కల్పించింది. పంట ఏదైనా సాగునీరే ముఖ్యం. నీటి యాజమాన్యంలో మెళకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చు. ఈ విషయాన్ని అనేక మంది రైతులు నిరూపించారు. ప్రస్తుతం తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. భూగర్భ జలాలు అడుగంటాయి. వచ్చే అరకొర నీటితోనే పంటలను సాగు చేసుకోవాల్సిన పరిస్థితులు దాపురించాయి. ఈ నీటిని పొదుపుగా వాడుకునేందుకు బిందు, తుంపర పద్ధతులు అందుబాటులోకి వచ్చాయి. ముఖ్యంగా కూరగాయల తోటలో బిందు, తుంపర్ల సేద్యం సత్ఫలితాలిచ్చాయి. ఇది మరింత విస్తృతం చేసే క్రమంలో ప్రభుత్వం మరిన్ని ప్రోత్సాహకాలను అందిస్తోంది. ఇటీవల ప్రకటించిన బడ్జెట్‌లోనూ ఉద్యానశాఖకు ఊతమిస్తూ నిధులను కూడా పెంచింది. జిల్లాలో అధికారులు కూడా రైతులకు అవగాహన కల్పిస్తూ బిందు, తుంపర్ల సేద్యం చేసేలా చర్యలు తీసుకుంటున్నారు.

- మామిడి సాగుకు రూ. 13,300 మూడేళ్లకు అందిస్తుంది.
- మొదటి ఏడాది రూ.7,980, రెండో ఏడాది రూ.2,660, మూడో ఏడాది రూ.రూ.2,660
- దానిమ్మ సాగు మూడేళ్లలో హెక్టారుకు రూ.26,672 అందజేస్తారు.
- బత్తాయి సాగుకు రూ.16,044
- జామ సాగుకు రూ. 29.331
- అరటి సాగుకు రూ. 40,985
- బొప్పాయికి మూడేళ్లలో హెక్టారుకు రూ.24,662 బ్యాంకు ఖాతాలో జమ చేస్తారు
- హైబ్రీడ్ కూరగాయలు హెక్టారుకు రూ. 20 వేల వంతున ప్రభుత్వం రాయితీ ఇస్తుంది

పండ్ల తోటల విస్తరణ పథకం

నూతన తోటలను అభివృద్ధి పరచడం ఈ పథకం ముఖ్య ఉద్దేశం. వివిధ పండ్ల తోటలకు చెందిన రైతులకు మొదటి ఏడాదితో పాటు రెండు, మూడు సంవత్సరాలకు సైతం రాయితీ అందిస్తుంది. ఎకరా నుంచి ఐదెకరాల వరకు ఉన్న అన్ని వర్గాల రైతులకు ఒకే రాయితీ అమలు చేస్తుంది. హెక్టారుకు ప్రభుత్వం అందిస్తున్న నగదు రాయితీ ఇలా ఉన్నాయి.

శాశ్వత పందిళ్ల నిర్మాణం

నాణ్యమైన తీగ జాతి కూరగాయల సాగును ప్రోత్సాహించేందుకు ఉద్యానశాఖ ద్వారా శాశ్వత పందిళ్ల నిర్మాణానికి రాయితీ ఇస్తున్నారు. మొత్తం ఖరీదులో 50శాతం రాయితీ లేదా ఎకరాకు లక్ష రాయితీ ఇవ్వనున్నారు. మల్చింగ్ ఉద్యన పంట సాగులో కలుపు నివారణ, కూలీల ఖర్చు తగ్గించేందుకు నేలలో నీటి శాతం నిల్వకు ఒక హెక్టారుకు 50 శాతం రాయితీపై రూ.16వేల వరకు రాయితీ అందజేయనున్నారు.

రక్షణాత్మకమైన సాగు

ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో కూరగాయల నారు, కూరగాయల పెంపకం, పూల సాగును ప్రోత్సాహించేందుకు లబ్ధిదారుడికి గరిష్ఠంగా రూ. 4 వేల చదరపు మీటర్ల నీడవలలు, పాలిహౌస్ నిర్మాణానికి 50 శాతం రాయితీ ఇస్తున్నారు. నీడ వలలు చ.మీ 490 నుంచి రూ.652 వరకు ఇస్తున్నారు. మినీ ట్రాక్టర్లు, కొమ్మ కత్తిరింపులకు, పూల సాగు, ప్యాక్ హౌస్, షేడ్ నెట్‌కు రాయితీ ఇస్తున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



రైతులు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలి. తద్వారా ప్రతి రైతు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి. బీడు భూముల్లో కూడా విరివిగా పండ్ల తోటలను సాగు చేసేందుకు రైతులు ముందుకు రావాలి. ఉద్యాన, ఉపాధి పథకాల కింద సన్న, చిన్నకారు రైతులు పండ్ల సాగుకు రాయితీ పొందవచ్చు. బిందు, తుంపర సేద్యంలో ప్రతి నీటి చుక్క నేరుగా మొక్కకు అందడంతో ఏపుగా పెరుగుతాయి. ఎరువులను చల్లడానికి కూడా కూలీల సంఖ్య తగ్గి, ఎరువులు వృథా కావు.

-ఆనంద్, ఉద్యాన అధికారి, పొదలకూరు



మామిడి



మిరప



మల్చింగ్ విధానంలో వంగ సాగు